సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 29 । డిసెంబర్ । 2023



అమిత్‌షాను కలిసిన నేతలు

ఆదిలాబాద్: హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన బీజేపీ రాష్ట్రస్థాయి సమావేశానికి కేంద్ర మంత్రి అమిత్‌షా హాజరయ్యారు. ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆయనను సన్మానించారు. పార్లమెంట్ ఎన్నికలపై చర్చించారు.



మంత్రి సీతక్కకు వినతుల వెల్లువ

జిల్లాలో నిర్వహించిన ప్రజాపాలనకు హాజరైన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను పలువురు కలిశారు. సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు ఇచ్చారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
29.0/16.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. చలి పెరుగుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

సామర్థ్యాలు పెంపొందించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయులు విద్యాసామర్థ్యాలు పెంపొందించాలని డీఈవో ప్రణీత సూచించారు. గురువారం పట్టణంలోని సరస్వతీనగర్ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టిక పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. డీఈవో వెంట సెక్టోరల్ అధికారి సుజాత్‌ఖాన్ తదితరులున్నారు.

నేడు స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యవర్గ సమావేశం

ఆదిలాబాద్‌టౌన్: భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యవర్గ సమావేశం, నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం నిర్వహించనున్నట్లు డీఈవో ప్రణీత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో ఉదయం 11గంటలకు కార్యవర్గ ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సభ్యులు హాజరు కావాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: అమన్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు అర్బాజ్‌ఖాన్, నాయకులు పరమేశ్వర్, షేక్ కలీం, రాహుల్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ ప్రోగ్రాం అధికారిగా గజానన్



గజానన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా ఎయిడ్స్, లెప్రసీ ఇన్‌చార్జి ప్రోగ్రాం అధికారిగా గజానన్‌ను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్ నియమించారు. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ప్రోగ్రాం అధికారిగా పనిచేసిన డాక్టర్ శ్రీకాంత్ ఉన్నత చదువుల కోసం వెళ్లడంతో తాంసి మెడికల్ ఆఫీసర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈయనకు డిప్యూటీ పారామెడికల్ అధికారులు వామన్‌రావు, మధుసూదన్‌రావు, ఎల్టీ రమణాచారి, కార్యాలయ సిబ్బంది అనిల్, రాజశేఖర్, సతీశ్ పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

దరఖాస్తు కేంద్రాల పరిశీలన



దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పరిశీలిస్తున్న ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని కోలిపుర, మహాలక్ష్మివాడ కాలనీల్లో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి గురువారం పర్యటించారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు. ఎస్పీ వెంట మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీనివాస్, ఆదిలాబాద్‌రూరల్ సీఐ సైదారావు, టూటౌన్ సీఐ అశోక్ ఉన్నారు.

తాంసి మండలం వడ్డాడిలో..

తాంసి: మండలంలోని వడ్డాడి గ్రామంలో గురువారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభను ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి పరిశీలించారు. దరఖాస్తుదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. దరఖాస్తుదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. వారి వెంట సీపీవో వెంకటరమణ, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీవో సుధీర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రాజు, సీఐ సైదారావు, సర్పంచ్ సౌందర్య, పంచాయతీ కార్యదర్శి అజయ్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



జామ్నిలో ప్రజాపాలన సభలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ప్రజాపాలన షురూ

జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, వార్డులు కలిపి 517 ఉండగా, మొదటిరోజు 126 చోట్ల సభలు నిర్వహించారు. మొత్తంగా మొదటిరోజు 11,595 దరఖాస్తులు వచ్చాయి.

- దరఖాస్తులు స్వీకరించిన అధికారులు
- మొదటిరోజు ప్రజల్లో విశేష స్పందన
- దరఖాస్తు ఫారాల కొరతతో ఇక్కట్లు
- జైనథ్ మండలం జామ్నిలో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఇన్‌చార్జి మంత్రి సీతక్క

జిల్లాలో సభలు, దరఖాస్తుల వివరాలు

మొత్తం గ్రామాలు: 468
మొదటిరోజు సభలు: 77
స్వీకరించిన దరఖాస్తులు: 6,248
మొత్తం వార్డులు: 49
మొదటిరోజు సభలు: 49
స్వీకరించిన దరఖాస్తులు: 5,347



దరఖాస్తు స్వీకరిస్తున్న మంత్రి సీతక్క



హాజరైన గ్రామస్తులు

సాక్షి, ఆదిలాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన కార్యక్రమం గురువారం జిల్లాలో లాంఛనంగా ప్రారంభమైంది. అభయహస్తం పథకాల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుండగా, మొదటిరోజు ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. దరఖాస్తు చేసుకునేందుకు జనాలు అధికసంఖ్యలో వచ్చారు. జైనథ్ మండలం జామ్ని గ్రామంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క గురువారం ఉదయం లాంఛనంగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. దరఖాస్తు స్వీకరణకు ఏర్పాటు చేసిన కౌంటర్లను ప్రారంభించి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

ప్రజల నుంచి స్పందన

ముందుగా ప్రకటించినట్లు ఆదిలాబాద్ పట్టణంలోని వార్డులు, ఆయా మండలాల్లోని గ్రామాల్లో సభలు నిర్వహించగా ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. జనం అధికసంఖ్యలో హాజరై దరఖాస్తు చేసుకున్నారు. పలుచోట్ల దరఖాస్తుదారుల సంఖ్యకు అనుగుణంగా ఫారాలు సరిపడా అందలేదు. తాంసి మండలం వడ్డాడి గ్రామంలో దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన పలువురికి ఫారాలు దొరకకపోవడంతో వారు గంటలకొద్దీ నిరీక్షించారు. చివరికి అధికారులు ఆదిలాబాద్ నుంచి ఫారాలు తెప్పించేదాకా వారు అక్కడే ఉన్నారు. దరఖాస్తుదారుల సంఖ్యకు అనుగుణంగా ఫారాలను అందుబాటులో ఉంచాలన్న డిమాండ్ ప్రజల నుంచి వ్యక్తమైంది. కాగా, దరఖాస్తుల కోసం కొందరు జిరాక్స్ సెంటర్లను ఆశ్రయించడం కనిపించింది. ప్రధానంగా ఆదిలాబాద్ పట్టణంలో ఈ పరిస్థితి కాస్త ఎక్కువగా ఉంది. అధికారులు ఆయా కేంద్రాల్లోనే ఫారాలు ఇస్తారనే విషయంపై ప్రజల్లో అవగాహన కల్పించకపోవడమే ఈ పరిస్థితికి కారణమైంది. దీంతో పలువురు జిరాక్స్ సెంటర్లను ఆశ్రయించగా నిర్వాహకులు ఒక్కో ఫారానికి రూ.20 నుంచి రూ.30 వరకు వసూలు చేశారు. అధికారులు దీన్ని నియంత్రించాలని పలువురు కోరారు.

అర్హులందరికీ వర్తింపజేస్తాం: మంత్రి సీతక్క

ప్రజలు అందించిన దరఖాస్తులను పరిశీలించి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. జామ్నిలో ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం వేదిక పైనుంచి ఆమె ప్రజలనుద్దేశించి మాట్లాడారు. విద్య, వైద్యం, రోడ్లు, సాగు, తాగునీరు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, తదితర సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు కూడా ప్రజలు అందించవచ్చని సూచించారు. వందరోజుల్లో మిగతా గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పారు. పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడంతోపాటు ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. మొదట జామ్ని గ్రామానికి చేరుకున్న మంత్రి సీతక్క కొమురంభీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా, జెడ్పీటీసీ అరుంధతి, ఎంపీపీ గోవర్ధన్, సర్పంచ్ పెందూర్ కాంతాబాయి, డీఆర్డీవో కిషన్, డీపీవో శ్రీనివాస్, ఎంపీడీవో గజానన్, కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాసరెడ్డి, బాలూరి గోవర్ధన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కాగా, ఆదిలాబాద్ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే జైనథ్ మండలంలో ఈ కార్యక్రమం ప్రారంభించగా, స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ హాజరు కాలేదు. ఎమ్మెల్యే దగ్గరి బంధువు మృతిచెందగా ఆయన ఉదయం నుంచి అందుబాటులో లేరు. ఆ తర్వాత హైదరాబాద్‌లో అమిత్‌షా పర్యటన ఉండడంతో ఆయన అక్కడికి వెళ్లారు. మొదటిరోజు పాల్గొనలేదు. బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ స్థానికంగా లేకపోవడంతో ఆయన కూడా పాల్గొనలేదు. ఇద్దరు ఎమ్మెల్యేలకు అధికారికంగా ఆహ్వానం ఉన్నట్లు పేర్కొన్నారు.

మొదటి దరఖాస్తు ఇచ్చిన



అభయహస్తం సంక్షేమ పథకాల కోసం జామ్నిలో నేనే మొదటి దరఖాస్తు అందజేసిన. ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవడం సంతోషంగా ఉంది. ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్న. కొత్త ఇల్లు కట్టిస్తే బాగుంటది. మా కష్టాలు తీరుతయ్.

– కుర్సంగే చంద్రకళ, జామ్ని

సర్కార్‌పై నమ్మకముంది



కాంగ్రెస్‌పై నమ్మకం ఉంది. హామీలు నెరవేర్చుతుందని ఆశిస్తున్న. ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవడం కోసం గ్రామసభలు నిర్వహించడం బాగుంది. మంత్రి సీతక్కకు నేరుగా దరఖాస్తు అందించడం చాలా ఆనందంగా ఉంది.

– మెస్రం సంగీత, జామ్ని

దరఖాస్తుల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ రాహుల్‌రాజ్



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారంటీ దరఖాస్తుల స్వీకరణకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని రణదీవెనగర్, గాంధీనగర్ వార్డు సభలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుష్బు గుప్తాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్హులకు సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని చెప్పారు. దరఖాస్తు ఫారాలను ఉచితంగా అందించడంతో పాటు కేంద్రాల వద్ద ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులు నింపేందుకు అవసరమైన సూచనలు అందించాలని, ప్రతీ దరఖాస్తును రిజిస్టర్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ శైలజ, డీవైఎస్వో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అనేక పథకాలు



దివ్యాంగురాలికి కేక్ తినిపిస్తున్న మిల్కా

ఆదిలాబాద్‌టౌన్: దివ్యాంగుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి పేర్కొన్నారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మెహతాతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. పింఛన్లు, ఇళ్ల మంజూరు, ఉచిత బస్సు సౌకర్యం, ఇతర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి నివేదిస్తామని పేర్కొన్నారు. సదరమ్ క్యాంపును కలెక్టర్ ఆదేశాల మేరకు త్వరలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 7,070 మందికి దివ్యాంగుల పింఛన్లు ప్రతినెలా అందిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పలువురు దివ్యాంగ చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగులతో కలిసి అదనపు కలెక్టర్, శిక్షణ సహాయ కలెక్టర్, అధికారులు కేక్‌కట్ చేశారు. అనంతరం పలువురు దివ్యాంగులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి మిల్కా, మైనార్టీ సంక్షేమ అధికారి రాథోడ్ రమేశ్, డీఆర్డీవో కిషన్, జిల్లా విద్యాధికారి ప్రణీత, దివ్యాంగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మత్స్య పారిశ్రామిక సంఘం కార్యవర్గం



సభ్యులను సన్మానిస్తున్న అధికారి సాంబశివరావు

కైలాస్‌నగర్: మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అడహక్ కమిటీ కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. స్థానిక పశు సంవర్ధకశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో ముందుగా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 92 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షులు హాజరయ్యారు. సమస్యలపై చర్చించిన అనంతరం 10మందితో కూడిన తాత్కాలిక కార్యవర్గం, ఒక చీఫ్ ప్రమోటర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చీఫ్ ప్రమోటర్‌గా బొంపల భూమన్న (ఆదిలాబాద్) ఎన్నిక కాగా, కార్యవర్గ సభ్యులుగా పీ పోశెట్టి (బోథ్), ఎన్.రమేశ్ (బజార్‌హత్నూర్), జింక లక్ష్మణ్ (ఇచ్చోడ), ఎస్.సోనేరావు, జీ భీమన్న (ఉట్నూర్), టీ అశోక్ (జైనథ్), టీ శ్యాంరావు (బేల), శ్రీనివాస్ (తలమడుగు), లక్ష్మి (ఉట్నూర్), సవిత (జైనథ్) ఎన్నికైనట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి వై.సాంబశివరావు తెలిపారు. అనంతరం వారిని సహకార సంఘాల అధ్యక్షులు పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. జిల్లా కార్యవర్గాన్ని రిజిస్టర్ చేసుకున్న అనంతరం సభ్యులు ఐకమత్యంగా ఉంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలను మత్స్యకారులకు అందించేలా అండగా నిలువాలని సూచించారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ప్రధాన కార్యదర్శి మేకల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర జీవనం అలవర్చుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థి దశలోనే సుస్థిర జీవన విధానం అలవర్చుకోవాలని డీఈవో ప్రణీత సూచించారు. జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో ఎన్‌జీసీ ఆధ్వర్యంలో గురువారం సుస్థిర జీవన విధానంపై జిల్లాస్థాయి సదస్సు నిర్వహించగా పాల్గొని మాట్లాడారు. పరిశుభ్రత ఇంటినుంచే మొదలైతే చాలా వ్యాధులకు అడ్డుకట్ట వేయగలమని విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లాలోని 50 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. చెత్త నిర్వహణ, కంపోస్ట్ ఎరువుల తయారీ, కాలుష్య విధానాన్ని ప్రయోగాల ద్వారా వివరించారు. నేషనల్ గ్రీన్ కోర్ ప్రాజెక్ట్ అధికారి విద్యాసాగర్, స్టేట్ రిసోర్స్‌పర్సన్స్ మేజర్ శివకిరణ్, వెంకటేశ్వర్లు, ఎన్జీసీ జిల్లా సమన్వయకర్త కంటె నర్సయ్య, జిల్లా సైన్స్ అధికారి రఘురమణ, అకాడమిక్ కోఆర్డినేటర్ ఆరె భాస్కర్, సెక్టోరియల్ అధికారులు నారాయణ, సుజాత్‌ఖాన్, పాఠశాల ప్రిన్సిపాల్ దేవేందర్ పటాస్కర్ ఉన్నారు.

యాజమాన్య పద్ధతులు తప్పనిసరి



శనగ పంటను పరిశీలిస్తున్న డీఏవో పుల్లయ్య

ఇచ్చోడ: రబీలో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడి పొందాలని డీఏవో పుల్లయ్య తెలిపారు. గురువారం ముఖరా(బీ)లో శనగ పంటను పరిశీలించారు. శనగ, గోధుమ, మక్క, జొన్న, కుసుమ సాగుకు ఇక్కడి నేలలు అనుకూలంగా ఉన్నాయని, రబీ పంటలు బాగున్నాయని, రసాయన ఎరువులు అతిగా వాడొద్దన్నారు. ఏవో జాదవ్‌కైలాస్, ఏఈవోలు సంధ్యారాణి, అనుదీప్‌రెడ్డి ఉన్నారు.

- జ్వరాలతో జిల్లా జనం విలవిల
- తగ్గని మాతా, శిశు మరణాలు
- రిమ్స్, పీహెచ్‌సీల్లో వైద్యులేరి?

‘సూపర్’ సేవలు అంతంతే..

2023 రివైండ్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఈ ఏడాది వ్యాధులు ప్రజలను అతలాకుతలం చేశాయి. అధిక వర్షాలతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారి విషజ్వరాలు విజృంభించాయి. సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొందరు జ్వరాలతో మృత్యువాత పడ్డారు. వైరల్ ఫీవర్‌తో పాటు డెంగీ తన ప్రతాపాన్ని చూపించింది. అయితే ఆరోగ్య మహిళతో ప్రతీ మంగళవారం మహిళలకు ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ వైద్యుల నియామకాలతో పీహెచ్‌సీలతో పాటు రిమ్స్‌లో ఖాళీలు భర్తీ అయ్యాయి. దీంతో రోగులకు నాణ్యమైన సేవలు అందుబాటులోకి వచ్చాయి. రూ.150 కోట్లతో నిర్మించిన రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యసేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. ఎనిమిది విభాగాలుండగా మూడు విభాగాల్లోనే సేవలు ప్రారంభమయ్యాయి. నెఫ్రాలజీ, గ్యాస్ట్రాలజీ, న్యూరోఫిజీషియన్, అంకాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, కార్డియాలజీ సేవలు లేకపోవడంతో రూ.కోట్లు వెచ్చించి నిర్మించినా ఆస్పత్రి ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చడం లేదు. వైద్యశాఖకు గతం కంటే ఈ ఏడాది మేలు జరిగింది. గత ప్రభుత్వ హయాంలో వైద్యారోగ్య శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు ప్రత్యేక దృష్టి సారించగా ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి వచ్చింది. రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో పూర్తిస్థాయి వైద్యులను నియమిస్తే జిల్లా ప్రజలకు మేలు జరగనుంది.



జ్వరపీడితులతో నిండిన రిమ్స్‌లోని బెడ్లు (ఫైల్)



రిమ్స్ ఓపీ వద్ద బారులుతీరిన పేషెంట్లు (ఫైల్)



రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

అందుబాటులో ఉన్న వైద్యసేవలు

- ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా జిల్లాలోని నాలుగు పీహెచ్‌సీల్లో ప్రతీ మంగళవారం మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 5వేల మందికి స్క్రీనింగ్ చేశారు. ఇందులో ఒకరికి సర్జికల్ క్యాన్సర్ ఆపరేషన్ చేశారు. మరో మహిళకు కీమోథెరపీ ద్వారా చికిత్స అందించారు. చిన్న చిన్న రోగాలకూ చికిత్స అందిస్తున్నారు.
- ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కేఆర్‌కే, అనుకుంటలో బస్తీ దవాఖానలు ఏర్పాటు చేశారు. దీంతో ఆ ప్రాంత ప్రజలకు స్థానికంగానే వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి.
- జిల్లాలోని పీహెచ్‌సీల్లో రెగ్యులర్ పోస్టులు ఖాళీగా ఉండగా, ప్రభుత్వం 21 పోస్టులకు గాను 17 మంది రెగ్యులర్ వైద్యులను నియమించింది. దీంతో రోగులకు వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి.
- వైద్యశాఖలో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్లు, ఫార్మసిస్ట్‌లను రెగ్యులరైజ్ చేయగా.. వారికి మేలు జరిగింది.
- గర్భిణుల కోసం న్యూట్రిషియన్ కిట్లు అందించడంతో ఏజెన్సీ ప్రాంతంలో గర్భిణులకు రక్తహీనత సమస్య పరిష్కారమైంది.
- బోథ్ ఏరియా ఆస్పత్రిలో ఇదివరకు బ్లడ్ స్టోరేజీ కేంద్రం ఉండగా, ప్రభుత్వం బ్లడ్‌బ్యాంక్‌ను ఏర్పాటు చేసింది. దీంతో అత్యవసర సమయంలో రక్తం అవసరం ఉన్నవారికి అందించేందుకు వీలు కలిగింది.
- రిమ్స్ వైద్య కళాశాలకు ఈ ఏడాది 72 పీజీ సీట్లు మంజూరయ్యాయి. 50 పోస్టుల వరకు సీనియర్ రెసిడెంట్లను నియమించారు.
- నర్సింగ్ కళాశాల కోసం భవనం మంజూరు కాగా, డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలో నిర్మాణ పనులు చేపట్టారు.

రిమ్స్‌లో వివాదాలు..

- ఈ ఏడాది రిమ్స్‌లో పలు వివాదాలు చోటుచేసుకున్నాయి. రిమ్స్‌లో పనిచేసే ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్‌తో పాటు మరో ఐదుగురు బయటి వ్యక్తులు వైద్య విద్యార్థులపై దాడి చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని ఈనెలలో మెడికోలు ఆందోళన చేపట్టారు. ఆ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను టర్మినేట్ చేశారు. వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయడంతో శాంతించారు.
- రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఒకరు మృతిచెందగా, వారి బంధువులు హౌస్ సర్జన్‌పై దాడికి దిగారు.

- సూపర్ స్పెషాలిటీలో న్యూరో, పిడియాట్రిక్, యూరాలజీ, మోకాళ్ల కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు చేశారు. దీంతో రోగులకు స్థానికంగానే సూపర్‌సేవలు అందుతున్నాయి.
- జిల్లాలో రెండో విడత కంటివెలుగు ద్వారా వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు.
- ప్రభుత్వం రిమ్స్‌కు క్రిటికల్ కేర్ మంజూరు చేసింది. రూ.23 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది.
- రిమ్స్ ఆస్పత్రికి ఎంఆర్ఐ యంత్రం మంజూరైంది. అయితే ఇంతవరకు ఆ యంత్రం అందుబాటులోకి రాలేదు.
- రిమ్స్, ఉట్నూర్ ఏరియా ఆస్పత్రులకు ముస్కాన్ అవార్డులు దక్కాయి. నేషనల్ హెల్త్ మిషన్ సంయుక్త కార్యదర్శి విశాల్ చౌహాన్ ఈ అవార్డులు ప్రకటించారు. ఏడాదికి రూ.12 లక్షల చొప్పున మూడేళ్ల పాటు ఆస్పత్రుల అభివృద్ధి కోసం నిధులు మంజూరయ్యాయి.

జ్వరాలతో జనం విలవిల..

ఈ ఏడాది జిల్లాలో జ్వరాలు విజృంభించాయి. వైరల్ ఫీవర్‌తో పాటు డెంగీ, మలేరియా తదితర జ్వరాలు ప్రబలాయి. జ్వరాలతో జిల్లాలో 10 మంది వరకు మృతిచెందారు. శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో నవజాత శిశువులు, చిన్నారులు 20 మంది వరకు మరణించారు. రక్తహీనత, తదితర కారణాలతో ముగ్గురు గర్భిణులు, బాలింతలు మృతిచెందారు. ఇంద్రవెల్లి, సిరికొండ, అంకోలి పీహెచ్‌సీ పరిధిలో ఒక్కొక్కరు చొప్పున చనిపోయారు. డెంగీ జ్వరాలతో అధికారికంగా మరణాలు లేనప్పటికీ అనధికారికంగా 10 మంది వరకు మరణించారు. ఈ ఏడాది అక్టోబర్, నవంబర్ మాసాల్లో జనం తీవ్ర జ్వరాల బారిన పడ్డారు. రిమ్స్‌తో పాటు ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిక్కిరిసిపోయాయి. ఈ ఏడాది 178 డెంగీ కేసులు, రెండు మలేరియా కేసులు నమోదయ్యాయి.

- ఇంద్రవెల్లి మండలం అర్కపూర్ తండాకు చెందిన 15 ఏళ్ల దిలీప్ జ్వరంతో రిమ్స్‌లో చేరి నవంబర్ మాసంలో మృతిచెందాడు. ఇదే మండలం కేస్లాపూర్ గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలుడు మహేశ్ డెంగీతో చనిపోయాడు.
- బోథ్ మండలం కొత్త గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలిక జ్వరంతో రిమ్స్‌లో చేరింది. చికిత్స పొందుతూ మరణించింది.
- ఉట్నూర్ మండలం కన్నాపూర్‌లోని ఎర్రగుట్టకు చెందిన గంగుబాయి (20) జ్వరంతో మృతిచెందింది.

సరస్వతి కాల్వకు తప్పిన ప్రమాదం

- పరిమితికి మించి నీటి విడుదల
- వడ్యాల్ సమీపంలో కోతకు గురైన సరస్వతి కాల్వ
- సకాలంలో స్పందించిన ఇరిగేషన్ అధికారులు
- తప్పిన పెను ప్రమాదం


నిండుగా ప్రవహిస్తున్న సరస్వతి కాలువ

లక్ష్మణచాంద: మండలంలో ప్రవహిస్తున్న సరస్వతి కాలువకు పెను ప్రమాదం తప్పింది. బుధవారం మధ్యాహ్నం సరస్వతి కాలువకు పరిమితికి మించి నీరు విడుదల చేయడంతో మండలంలోని వడ్యాల్, బాబాపూర్ గ్రామాల వద్ద ప్రమాదకరంగా ప్రవహించింది. గురువారం ఉదయం అటువైపు వెళ్లిన వడ్యాల్ గ్రామస్తులకు ఎస్కేప్ కెనాల్ వద్ద ఎప్పుడు ఎత్తే మోతాదులోనే గేటు ఎత్తడంతో గేటు పైనుంచి కాలువ గట్టు నుంచి నీరు ప్రవహిస్తూ కనిపించింది. దీంతో గమనించిన రైతులు వెంటనే ఇరిగేషన్ అధికారులకు తెలియజేశారు. దీంతో వెంటనే స్పందించిన ఇరిగేషన్ డీఈ నరేష్, ఏఈ మధుకర్‌రెడ్డిలు హుటాహుటిన వడ్యాల్ గ్రామ సమీపంలోని సరస్వతి కాలువను పరిశీలించారు. కాలువ ప్రమాదకరంగా పారుతుండడంతో వెంటనే శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్ అధికారులతో మాట్లాడి కాలువకు నీటిమట్టం తగ్గించారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. లేదంటే సరస్వతి కాలువకు పలుచోట్ల పెద్ద ఎత్తున గండ్లు పడి పెను ప్రమాదమే సంభవించేదని మండల వాసులంటున్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారులను సంప్రదించగా సరస్వతి కాలువకు కేవలం 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తామని, కానీ గేటు మొరాయించడంతో సుమారు 1000 క్యూసెక్కుల నీటివరకు విడుదలైందని, దీంతో పరిమితికి మించి నీరు రావడంతో ఇలా జరిగిందని తెలిపారు. సకాలంలో స్పందించడంతో నీటి విడుదలను తగ్గించామని, దీంతో పెను ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు.


కోతకు గురైన కాలువను పరిశీలిస్తున్న డీఈ నరేష్

ఆదాయం దిశగా పోలీస్‌శాఖ అడుగులు

- జిల్లా కేంద్రంలో పోలీస్‌వారి సూపర్ మార్కెట్, పెట్రోల్ బంక్
- నేడు ప్రారంభం కానున్న సూపర్ మార్కెట్

నిర్మల్‌టౌన్: నిర్మల్ పోలీస్‌శాఖ ఆదాయం దిశగా అడుగులు వేస్తోంది. శాంతి భద్రతలను కాపాడేందుకు నిరంతరం శ్రమిస్తున్న పోలీస్‌శాఖ వ్యాపార రంగంలోకి అడుగు పెట్టబోతోంది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని పోలీస్‌శాఖ పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసింది. స్థానిక డీఎస్పీ కార్యాలయానికి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ఈ బంక్ నిర్మాణం పనులు పూర్తి కానున్నాయి. ఈ పెట్రోల్ బంకు నిర్వహణకు పోలీస్ శాఖ పర్యవేక్షించనుండగా పనిచేసే సిబ్బందిని మాత్రం అవుట్ సోర్సింగ్ ద్వారా నియమించనున్నారు. దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని పోలీస్‌శాఖ అభివృద్ధికి వినియోగించనుంది.


ప్రారంభానికి సిద్ధంగా పోలీస్ సూపర్ మార్కెట్

నేడు సూపర్ మార్కెట్ ప్రారంభం

జిల్లా కేంద్రంలో పోలీస్‌శాఖ ఏర్పాటు చేసిన సూపర్ మార్కెట్ ఈ నెల 29న ప్రారంభం కానుంది. సూపర్ మార్కెట్‌ను పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కన నిర్మించారు. ఇందులో నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచనున్నారు. ఇందులో పోలీస్ సిబ్బంది మాత్రమే కొనుగోలు చేయవచ్చు. ఇందులో దొరికే వస్తువులకు ట్రాన్స్‌పోర్ట్, టాక్స్‌లు ఉండవు. ఈ సూపర్ మార్కెట్లో సిబ్బంది ట్రైనింగ్ అయిన పోలీసులు ఉండనున్నారు.

మంత్రి సీతక్కకు వినతుల వెల్లువ


వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు..


వినతిపత్రం ఇస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి

కైలాస్‌నగర్: పదేళ్ల కాలంలోని పెండింగ్ బిల్లులు చెల్లించేలా చూడాలని బేల మండల సర్పంచ్‌లు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను స్థానిక ప్రజాసేవ భవన్‌లో అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే శాలువతో సత్కరించారు. మంత్రిని కలిసిన వారిలో సర్పంచ్‌లు ఆడే శంకర్, జంగ కేశవ్, సీతారాం, సంతోష్ ఉన్నారు.

అంగన్‌వాడీల వినతి..

మంత్రి సీతక్కను టీఎన్జీవోస్ అనుబంధ అంగన్‌వాడీలు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజాసేవ భవన్‌లో శాలువతో సత్కరించి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఇందులో సంఘం నాయకులు కే.రాధ, కవిత, అనిత, సునంద, సుజాత, పొచ్చుబాయి ఉన్నారు.

రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయండి

బోథ్: బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని ఆదిలాబాద్‌కు వచ్చిన మంత్రి సీతక్కను బోథ్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు కలిసి విన్నవించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి బోథ్‌ను డివిజన్‌గా చేస్తామని హామీ ఇచ్చారని మంత్రితో పేర్కొన్నారు. కార్యక్రమంలో చంటి, మహేందర్, అబూద్, గట్ల గంగాదర్, రాజశేఖర్ ఉన్నారు.

పోడు పట్టాదారుల సమస్యలు తీర్చాలి

ఎదులాపురం: పోడు పట్టాదారుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి మంత్రి సీతక్కకు విన్నవించారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా జిల్లాకు వచ్చిన మంత్రి సీపీఐ జిల్లా కార్యదర్శి కలిసి వినతి పత్రం అందజేశారు. అర్హులకు పోడుపట్టాలు ఇప్పించాలని కోరారు. సీసీఐని పునః ప్రారంభిస్తే 5 వేల కుటుంబాలకు ఉపాధి లభిస్తుందని కోరారు.

వైద్య శిబిరాలతో మెరుగైన వైద్యం

- ఏజెన్సీ జిల్లా అదనపు వైద్యాధికారి కుమ్రబాలు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో గిరిజనులకు మెరుగైన వైద్యం అందించడానికి ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ ఆదేశాలకు మేరకు మొబైల్ మెగా వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని ఏజెన్సీ జిల్లా అదనపు వైద్యాధికారి కుమ్ర బాలు అన్నారు. గురువారం గాదిగూడ మండలంలోని హీరాపూర్ గ్రామంలో మొబైల్ మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు మెరుగైనా వైద్యం అందించడంతో పాటు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాటుతో మొబైల్ మెగా వైద్య శిబిరం కోసం వాహనాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గిరిజనులు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచితంగా వైద్యం అందిస్తారని వివరించారు. వాతావరణంలో వస్తున్న మార్పులతో చాలా మంది దగ్గు, జలుబు, జ్వరాలతో బాధపడుతున్నారని వివరించారు. కరోనా ప్రభావం ఉన్న నేపథ్యంలో మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యుడు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, హెచ్ఈవో తులసిదాస్ రాథోడ్, హెచ్ఈ పవార్ రవీందర్ తదితరులు ఉన్నారు.


మెడికల్ క్యాంపును ప్రారంభిస్తున్న కుమ్రబాలు

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక


జాతీయస్థాయికి ఎంపకైన విద్యార్థులు

సోన్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి సీహెచ్.వరుణ్, అభ్యాస గురుకులం 9వ తరగతి విద్యార్థి సీహెచ్.విగ్నేష్ జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. హన్మకొండలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక చేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు ఆరాధన తెలిపారు. హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

రిమ్స్‌లో ఎమ్మెల్యే బొజ్జుకు వైద్యపరీక్షలు


రిమ్స్‌లో పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే


బస్సులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఎదులాపురం: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ టైఫాయిడ్‌తో బాధపడుతున్న విషయం తెలిసిందే. మంగళవారం రాత్రి ఎమ్మెల్యే అస్వస్థతకు గురై ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందారు. వైద్యులు విశ్రాంతి తీసుకోవాలని సూచించినా.. మంత్రి సీతక్క గురువారం జిల్లాలో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ హాజరయ్యారు. దీంతో మళ్లీ అస్వస్థతకు గురి కాగా గురువారం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో వైద్యపరీక్షలు చేయించుకున్నారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ పర్యవేక్షణలో సిబ్బంది వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేకు పలు సూచనలు చేశారు.

బస్సులోనే మహారాష్ట్రకు..

ఉట్నూర్‌రూరల్: కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు నాగ్‌పూర్‌లో నిర్వహించగా గురువారం ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రత్యేక బస్సులో నాగ్‌పూర్‌కు వెళ్లారు. ఎమ్మెల్యే వెంట నాయకులు లింగంపల్లి, ఎక్బాల్, చంద్రయ్య, లాజర్, ఉమేర్, సులోచన ఉన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ


దర్శించుకున్న శ్రీనివాసన్‌కృష్ణన్

భైంసా: బాసర సరస్వతి అమ్మవారిని గురువారం ఏఐసీసీ జనరల్ సెక్రటరీ శ్రీనివాసన్ కృష్ణన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి దేవస్థాన అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అర్చకులు శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు.

నాగ్‌పూర్‌కు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

- ప్రత్యేక బస్సులను జెండా ఊపి ప్రారంభించిన మంత్రి సీతక్క

కైలాస్‌నగర్: మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లోని దిగోరిలో నిర్వహించ తలపెట్టిన కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ వేడుకలకు కాంగ్రెస్ శ్రేణులు గురువారం భారీగా తరలివెళ్లారు. ఆదిలాబాద్ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక బస్సుల్లో బయలుదేరారు. కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో బయలుదేరిన ప్రత్యేక బస్సులను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క జెండా ఊపి ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించి 138 సంవత్సరాలు పూర్తి చేసుకుని 139వ వసంతంలోకి అడుగుపెడుతోందన్నారు. తెలంగాణ స్వరాష్ట్ర సాధన సైతం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమైందని గుర్తు చేశారు. ఎంతో గొప్ప చరిత్ర కలిగిన పార్టీ వేడుకలను మహారాష్ట్ర గడ్డపై జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బస్సును ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

నిర్మల్ ఐఎంఏ అధ్యక్షుడికి పురస్కారం

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ ఐఎంఏ(ఇండియన్ మెడికల్ అసోసియేషన్) అధ్యక్షుడు డాక్టర్ ఉదయగిరి రామకృష్ణకు ఐఎంఏ జాతీయస్థాయి పురస్కారం లభించింది. గురువారం కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో నిర్వహించిన 9వ నేషనల్ ఐఎంఏ కాన్ఫరెన్స్‌లో భాగంగా డాక్టర్ రామకృష్ణ ప్రతిష్టాత్మక 'నేషనల్ ప్రెసిడెంట్ అప్రిషియేషన్ అవార్డు' అందుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నాలుగేళ్లుగా ఆయన అందిస్తున్న సామాజిక, వైద్యసేవలకు ఈ పురస్కారం లభించింది. ముఖ్యఅతిథి కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయ్ విజయన్, జాతీయ ఐఎంఏ అధ్యక్షుడు శరత్‌కుమార్ అగర్వాల్, సంస్థ ప్రతినిధులు అశోక్ తదితరుల చేతుల మీదుగా పురస్కారం స్వీకరించారు. రామకృష్ణతోపాటు డాక్టర్ కే.బాలాజీ ఈ సదస్సుకు హాజరయ్యారు. జాతీయ స్థాయి పురస్కారం నిర్మల్ వైద్యుడికి లభించడంపై జిల్లాకు చెందిన సీనియర్ వైద్యులు చక్రధారి, దామెరరాములు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.


పురస్కారాన్ని స్వీకరిస్తున్న డా.రామకృష్ణ

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు


గుడుంబా బట్టివద్ద అధికారులు

ఖానాపూర్: మండలంలోని ఎక్బాల్‌పూర్ గ్రామంలో గురువారం ఎక్సైజ్ అధికారులు గుడుంబా స్థావరాలపై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా దాడుల్లో గ్రామానికి చెందిన సురేష్, యమునల వద్ద సుమారు 10లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవి తెలిపారు. అనంతరం గ్రామ శివారులో ప్లాస్టిక్ డ్రమ్ముల్లో పులియబెట్టిన 400లీటర్ల బెల్లం పానకాన్ని నిర్వీర్యం చేయడంతో పాటు గుడుంబా బట్టీని ధ్వంసం చేశారు. దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల ఆరోగ్య స్థితిగతులపై దృష్టి సారించాలి

- సికిల్ సెల్ స్క్రీనింగ్ టెస్ట్‌లను ప్రారంభించిన ఐటీడీఏ పీవో

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల ఆరోగ్య స్థితిగతులపై వైద్య శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొలాంగూడ గ్రామంలో పీవీటీజీల కోసం సికిల్ సెల్ స్క్రీనింగ్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ పీహెచ్‌లో పీవీటీజీలను తప్పకుండా టెస్ట్ చేయాలని సంబంధిత వివరాలను క్రమ పద్ధతిలో నమోదు చేయాలన్నారు. డివిజన్ పరిధిలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ మండలాల్లోని 8 పీహెచ్‌సీలకు 23 టీంల ద్వారా సికెల్‌సెల్ స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. గురువారం 8 పీహెచ్‌సీల పరిధిలో మొత్తం 605 స్క్రీనింగ్ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో దంతన్‌పల్లి పీహెచ్‌సీ వైద్యురాలు అనురాధ, డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఆశా వర్కర్లు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.


సికెల్‌సెల్ స్క్రీనింగ్ ప్రారంభిస్తున్న పీవో

బడి బయట పిల్లల గుర్తింపు

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాల్లో బడి బయట పిల్లలను సీఆర్పీలు సుధాకర్, మహేందర్ గుర్తించారు. గురువారం మండలంలోని పీచర గ్రామ పంచాయతీ పరిధిలో ఇటుక బట్టీల వద్ద వలస కూలీల పిల్లలను ముగ్గురిని సీఆర్పీలు గుర్తించారు. అలాగే మండలంలోని ధర్మారం గ్రామంలో వినికిడి లోపం గల ఇద్దరు పిల్లలను గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహించే సర్వేలో భాగంగా 6 నుంచి 14 ఏళ్ల బాల, బాలికలను, 6 నుంచి 18 ఏళ్ల శారీరక, మానసిక వైకల్య లక్షణాలను కలిగిన బాల బాలికలను గుర్తించి వారి లోపాలకనుగుణంగా ఉపకరణాలు అందించడం జరుగుతుందన్నారు. శారీరక అంగవైకల్యం కలిగిన బాల బాలికల వీల్ చైర్స్, వినికిడి లోపం గల విద్యార్థులకు హియరింగ్ మిషన్స్, 10 ఏళ్లు పైబడిన బాలికలు బడిబయట గుర్తించి వారిని దగ్గరలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశం కల్పిస్తున్నామన్నారు. ఇందులో సీఆర్పీలు సుధాకర్, మహేందర్ ఉన్నారు.


ఇటుక బట్టీల వద్ద పిల్లలను గుర్తించిన సీఆర్పీ

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

ఎదులాపురం: మద్యానికి బానిసై మనస్తాపంతో ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ అశోక్ కథనం ప్రకారం... జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్‌కు చెందిన గొర్ల అనిల్ గతంలో మున్సిపల్ పరిధిలోని హరితహారంలో పని చేసేవాడు. ఉద్యోగంలో నుంచి తీసేయడంతో ఉపాధి కోల్పోయిన అనిల్ మద్యానికి బానిసయ్యాడు. ఈ తరుణంలో తాగేందుకని బుధవారం భార్య లక్ష్మిని డబ్బులు అడుగగా నిరాకరించింది. దీంతో మనస్తాపానికి గురైన అనిల్ రాత్రి 8.30 గంటల ప్రాంతంలో ఇంట్లో గది తలుపులు వేసుకుని ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గురువారం తెలిపారు.

బాలుడి మృతికి కారణమైన వ్యక్తికి జైలు

నిర్మల్‌టౌన్: రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతికి కారణమైన వ్యక్తికి నిర్మల్ న్యాయస్థానం జైలు శిక్ష, జరిమానా విధిస్తూ గురువారం తీర్పునిచ్చింది. కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ తెలిపిన విరాల ప్రకారం... సారంగపూర్ మండలంలోని కంకట గ్రామానికి చెందిన ఖరారి మల్లయ్య కుమారుడైన వెంకటరమణ 20నెలలు బాలుడు. మే8, 2014న ఇంటి బయట ఆడుకుంటున్నాడు. తాండ్ర గ్రామానికి చెందిన సట్ల రాజశేఖర్ తన ఆటోతో అతివేగంగా నడుపుకుంటూ వచ్చి బాలుడిని ఢీకొన్నాడు. బాలుడి తలకు బలమైన గాయం కావడంతో 108 అంబులెన్స్‌లో నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్తుండగా.. మార్గంమధ్యలో మృతిచెందాడు. దీంతో తండ్రి తండ్రి ఖరారి మల్లయ్య సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై జి.మల్లేష్ కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపరిచాడు. ఏపీపీవో జి.రామకృష్ణ తొమ్మిది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేశాడు. ఈ మేరకు సట్ల రాజశేఖర్‌కు తొమ్మిది నెలల సాధారణ జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ నిర్మల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి అజయ్‌కుమార్ తీర్పునిచ్చారు.

కుట్రలు ఛేదించుకుని ఏఐటీయూసీ విజయం

ఎదులాపురం: కుట్రలను ఛేదించుకుని సింగరేణి ఎన్నికల్లో ఏఐటీయూసీ ఘన విజయం సాధించిందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. విజయాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని తెలంగాణచౌక్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన ఏఐటీయూసీతోనే సాధ్యమని కార్మికులు మరోసారి రుజువు చేశారన్నారు. సింగరేణి ఎన్నికల్లో ఏఐటీయూసీ ఘన విజయం సాధించడమే ఇందుకు నిదర్శనం అన్నారు. ఐఎన్‌టీయూసీ టీబీజీకేఎస్‌తో కలిసి ఏఐటీయూసీని ఓడించే ప్రయత్నం చేసినప్పటికీ కార్మికులు తమ వైపే మొగ్గు చూపారన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం వారి హక్కుల పరిరక్షణకు శ్రద్ధ చూపాలన్నారు. ఏఐటీయూసీ నాయకులు గాజంగుల రాజు, సీపీఐ నాయకులు ఉన్నారు.



సంబరాల్లో ఏఐటీయూసీ నాయకులు

అధికారిక వేదిక... తగునా నాయకా



అధికారిక కార్యక్రమంలో నిబంధనల ప్రకారం ప్రజాప్రతినిధులు, అధికారులే హాజరు కావాలి. కానీ గురువారం జైనథ్ మండలం జామిని గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన అధికారిక కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొనడమే కాకుండా అధికారిక వేదికపై అడిషనల్ కలెక్టర్ కుష్బు గుప్తా పక్కన దర్జాగా ఆసీనులవ్వడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

క్లుప్తంగా

నిజామాబాద్‌లో బాలికల ఆచూకీ లభ్యం

- సెల్‌ఫోన్ చూడడంతో తల్లిదండ్రుల మందలింపు
- ఇంటినుంచి వెళ్లిపోయిన విద్యార్థినులు

ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్)/ఆదిలాబాద్‌రూరల్: తరచూ సెల్‌ఫోన్ చూస్తున్నారని తల్లిదండ్రులు మందలించడంతో ఆదిలాబాద్‌లోని ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలికల ఆచూకీ నిజామాబాద్‌లో లభ్యమైంది. వివరాలిలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ధోబీ కాలనీకి చెందిన నలుగురు బాలికలు సరస్వతినగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. తరచూ ఫోన్‌లో ఇన్‌స్టాగాం చూస్తుండడంతో తల్లిదండ్రులు మందలించారు. బుధవారం స్కూల్‌కు వెళ్తున్నామని చెప్పి వెళ్లిన బాలికలు సాయంత్రం 6 గంటలైనా తిరిగి రాలేదు. తల్లిదండ్రులు మావల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆదిలాబాద్ బస్టాండ్‌లో సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించారు. నిజామాబాద్ బస్సు ఎక్కినట్లు గుర్తించారు. తల్లిదండ్రుల సెల్‌ఫోన్లలో ఇన్‌స్టాగాంలో వాయిస్ ఆధారంగా నిజామాబాద్ వచ్చినట్లు గుర్తించి ఇక్కడి పోలీసులకు సమాచారం అందించారు. నిజామాబాద్ పోలీసులు అర్ధరాత్రి బస్టాండ్‌కు చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. మావల పోలీసులకు బాలికలను గురువారం అప్పగించారు. వీరు ఇన్‌స్టాగాంలో పరిచయమైన వారి కోసం నిజామాబాద్‌కు వచ్చినట్లు సమాచారం.

నర్సింగ్ విద్యార్థిని మృతి

సోన్: సోన్ మండలం మాధాపూర్ గ్రామానికి చెందిన పడిగెల పోశెట్టి, రాధ దంపతుల కూతురు సంజన(21) గురువారం మృతిచెందింది. తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. సంజన బాన్సువాడలోని నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ రెండో సంవత్సరం చదువుతోంది. గత కొంతకాలంగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. వారం రోజులుగా హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించింది.

గాలింపు చర్యలు ముమ్మరం

ఇంద్రవెల్లి: ఈ నెల 26న ఇంద్రవెల్లి మండలంలోని కొబ్బయ్‌గూడ గ్రామ సమీపంలోని చెరువులో అదృశ్యమైన అంజి గ్రామానికి చెందిన గారుళే నాందేవ్ కోసం పోలీసులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. నాందేవ్‌కు తోడుగా వెళ్లిన రమేష్, మారుతి, డిగంబర్‌లు ఇచ్చిన సమాచారం మేరకు చెరువు ఒడ్డుకు ఉన్న నాందేవ్ చెప్పులు, బట్టలను గుర్తించి గురువారం ఉట్నూర్‌కు చెందిన గజఈతగాళ్లతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకూ గాలించినా ఆచూకీ తెలియరాలేదు. గాలింపు చర్యలను ఏఎస్సై లక్ష్మణ్ దగ్గరుండి పర్యవేక్షించారు. సాయంత్రం వరకూ గాలింపు చర్యలు చేపట్టామని, ఆచూకీ కానరాలేదని ఎస్సై సునీల్ తెలిపారు.

లారీ నుంచి కిందపడి ఒకరి మృతి

భైంసారూరల్: ప్రమాదవశాత్తు లారీపై నుంచి పడి హమాలీ గాయక్‌వాడ్ ఉత్తం(56) మృతిచెందినట్లు భైంసారూరల్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వివరాల ప్రకారం... భైంసా పట్టణానికి చెందిన గాయక్‌వాడ్ ఉత్తం గురువారం రాశీ జిన్నింగ్ ఫ్యాక్టరీలో పనిచేసేందుకు వెళ్లాడు. బెల్స్ దించుతుండగా ప్రమాదవశాత్తు లారీలో నుంచి కిందపడిమృతిచెందాడు. మృతుడికి భార్యతోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.